

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు : ఎస్పీ

**ప్రజానావ, సిరిసిల్ల :** బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలగడంతో పాటు ఇతర నేరాలకు అవకాశం ఏర్పడే ప్రమాదం ఉందని, ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఎస్పీ మహేష్ బి. గితే హెచ్చరించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ లక్ష్యంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 84 మంది మందు బాబులను గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు ఇటువంటి ప్రత్యేక డ్రైవ్‌లు నిరంతరం కొనసాగుతాయని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే ప్రాంతాలపై నిరంతరం నిఘా ఉంచుతున్నామని, ముఖ్యంగా రాత్రి సమయాల్లో లైటింగ్ తక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి అక్కడ మరింత సమర్థవంతంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

## ప్రభుత్వ లాంఛనాలతో కానిస్టేబుల్ అంత్యక్రియలు

### కుటుంబానికి రూ.30 వేల ఆర్థిక సాయం



**ప్రజానావ, నాగర్‌కర్నూల్:** పిడుగుపాటుకు గురై మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ రాజు అంత్యక్రియలు ప్రభుత్వ అధికార లాంఛనాలతో నిర్వహించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ ఆదేశాల మేరకు రాజు స్వగ్రామమైన ఉల్పర గ్రామంలో ఆదివారం అంతిమ సంస్కారాలు జరిగాయి. శుక్రవారం సాయంత్రం మామిళ్లపల్లి గ్రామ సమీపంలో విధి నిర్వహణలో ఉండగా పిడుగుపాటుకు గురైన కానిస్టేబుల్ రాజు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసు శాఖ అధికారిక గౌరవాలతో ఆయనకు తుది వీడ్కోలు పలికింది. అంత్యక్రియలకు హాజరైన అదనపు ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు రాజు పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీసు శాఖ తరఫున అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.30,000 ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మృతుడి కుటుంబానికి పోలీసు శాఖ అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రాజు సేవలను గుర్తు చేసుకుంటూ ఆయన మృతి పోలీసు శాఖకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జగన్, ఆర్ఎస్ఐలు ప్రశాంత్, గౌస్ పాషా, శివాజీ, ఉప్పునుంతల ఎస్సై మహేష్‌తో పాటు జిల్లా పోలీసు సిబ్బంది, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పాల్గొని రాజుకు కన్నీటి వీడ్కోలు పలికారు.

## మరో రెండు వారాలు హైడ్రా ప్రజావాణి రద్దు

### జూన్ 22 నుంచి యథావిధిగా సేవలు

#### పెండింగ్ ఫిర్యాదుల పరిష్కారమే కారణం : హైడ్రా కమిషనర్ రంగనాథ్



**ప్రజానావ, హైదరాబాద్:** ప్రతి సోమవారం నిర్వహించే హైడ్రా ప్రజావాణి కార్యక్రమానికి మరో రెండు వారాల పాటు విరామం ఇవ్వనున్నట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రకటించారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన వివరాలు వెల్లడించారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయడం కోసం మే 11వ తేదీ నుంచి నాలుగు వారాల పాటు ప్రజావాణి కార్యక్రమాన్ని నిలిపివేసిన విషయం తెలిసిందే. వాస్తవానికి ఈ నెల 8వ తేదీ నుంచి ప్రజావాణి తిరిగి ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ, ఇంకా కొన్ని కీలకమైన ఫిర్యాదులు పరిష్కార దశలో ఉండటంతో విరామాన్ని మరో రెండు వారాలు పొడిగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీంతో జూన్ 8, 15 తేదీల్లో నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాలు రద్దు కానున్నాయి. పెండింగ్ ఫిర్యాదులన్నింటినీ సమీక్షించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేకంగా పనిచేస్తున్నారని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులను స్వీకరించే హైడ్రా ప్రజావాణి కార్యక్రమం జూన్ 22వ తేదీ నుంచి యథావిధిగా కొనసాగుతుందని ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

# చేపల మందు పంపిణీకి అంతా సిద్ధం

### మంత్రులు పొన్నం, వాకిటి



**ప్రజానావ, హైదరాబాద్:** మృగశిర కార్తెను పురస్కరించుకుని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో అస్తమా వ్యాధిగ్రస్తుల కోసం నిర్వహించే సాంప్రదాయ "చేప ప్రసాదం" పంపిణీ ఏర్పాట్లను రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మైదానంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన భారీ క్యూలైన్లు, బారికేడ్లను వారు నిశితంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, శాట్ చైర్మన్ శివసేనారెడ్డితో పాటు ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ఈ ఏడాది చేప ప్రసాదం పంపిణీ జూన్ 8వ తేదీ (నేడు) రాత్రి 9 గంటలకు ప్రారంభమై, మరుసటి రోజు (9వ తేదీ) కూడా నిరంతరాయంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. మృగశిర కార్తె వాతావరణంలో చల్లదనాన్ని తెస్తుందని, ఉబ్బసం, ఆయాసంతో బాధపడేవారికి ఈ చేప ప్రసాదం ఎంతో నమ్మకమైన వరప్రదాయని అని పేర్కొన్నారు. గత 176 సంవత్సరాలుగా బత్తిని కుటుంబం ఈ కార్యక్రమాన్ని ఒక పవిత్రమైన సాంప్రదాయంగా కొనసాగిస్తోందని కొనియాడారు. ఈ క్రతువు కోసం ఫిషరీస్ డిపార్ట్మెంట్ తరఫున ఇప్పటికే 1 లక్షా 35 వేల చేప పిల్లలను సిద్ధం చేసినట్లు మంత్రి వెల్లడించారు. హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఇప్పటికే అన్ని శాఖలతో సమీక్షలు పూర్తయ్యాయని, చివరి వ్యక్తికి ప్రసాదం అందే వరకు మంత్రులు, అధికారులమంతా గ్రౌండ్‌లోనే అందుబాటులో ఉంటామని, ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

- మెరుగైన వైద్య సేవలు అందించాలి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి
- కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



**ప్రజానావ, నాగర్‌కర్నూల్:** ఓప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ శనివారం ఉదయం అచ్చంపేట పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. పట్టణంలోని శానిటేషన్ పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మొదటగా పట్టణంలోని పలు వార్డుల్లో జరుగుతున్న శానిటేషన్ కార్యక్రమాలను కలెక్టర్ పరిశీలించారు. రహదారుల పరిశుభ్రత, చెత్త సేకరణ, డ్రైనేజీల నిర్వహణ, పారిశుద్ధ్య కార్మికుల పనితీరును పరిశీలించి స్థానిక ప్రజలతో మాట్లాడారు. పట్టణం పరిశుభ్రంగా ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ పారిశుధ్య కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో ఎక్కడా మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, డ్రైనేజ్ పనులను పరిశీలించిన కలెక్టర్ పలు సూచనలు చేశారు. అనంతరం అచ్చంపేట పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, నిర్మాణాల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా లబ్ధిదారులు త్వరగా ఇళ్లలోకి వెళ్లేలా పనులను వేగవంతంగా పనులను పూర్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణ నాణ్యతలో ఎలాంటి రాజీ ఉండకూడదని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సహాయం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని అన్నారు. తదనంతరం అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన జిల్లా కలెక్టర్, ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఆసుపత్రిలో నిల్వ ఉన్న మందుల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు, ఆసుపత్రి పరిశుభ్రత, మందుల వ్యాలిడిటీ తదితర అంశాలపై ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, పాముకాటు, కుక్కకాటుల మందులతో పాటు అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని వైద్యాధికారులను ఆదేశించారు. రోగులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సేవలు అందించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వైద్యులు తప్పనిసరిగా ఆసుపత్రులకు సమయపాలన పాటించి రోగులకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

# ప్రపంచ పర్యాటక రంగంలో తెలంగాణకు అరుదైన గౌరవం



- 'స్కాల్ ఇంటర్నేషనల్' అధ్యక్షుడిగా మోహన్ ఎన్నిక
- అభినందనలు తెలిపిన టీఆర్ఎస్ చీఫ్ కవిత

**ప్రజానావ, హైదరాబాద్:** ప్రపంచ పర్యాటక రంగంలో ప్రతిష్ఠాత్మక సంస్థగా గుర్తింపు పొందిన 'స్కాల్ ఇంటర్నేషనల్' అధ్యక్షుడిగా తెలంగాణకు చెందిన ఎన్ఎస్ఎన్ మోహన్ ఎన్నిక కావడం రాష్ట్రానికి గర్వకారణమని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. శనివారం బంజారాహిల్స్‌లోని తన నివాసంలో ఎన్ఎస్ఎన్ మోహన్ మర్యాదపూర్వకంగా కలవగా, ఈ సందర్భంగా కవిత ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ పర్యాటక రంగంలో భారతదేశ ప్రతిష్ఠను, తెలంగాణ ఖ్యాతిని మరింత ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. 94 ఏళ్ల చరిత్ర కలిగిన స్కాల్ ఇంటర్నేషనల్ సంస్థలో 2026 సంవత్సరానికి వైస్ ప్రెసిడెంట్‌గా, 2027 సంవత్సరానికి ప్రెసిడెంట్‌గా మోహన్ ఎన్నికయ్యారని తెలిపారు. సంస్థ చరిత్రలో ఆసియా ఖండం నుంచి అధ్యక్షుడిగా ఎన్నికవుతున్న తొలి వ్యక్తి ఆయన కావడం విశేషమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా పర్యాటక రంగానికి సేవలందిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక సంస్థలో అత్యున్నత పదవిని తెలంగాణకు చెందిన వ్యక్తి అధిరోహించడం రాష్ట్ర ప్రజలకు గర్వకారణమని కవిత వ్యాఖ్యానించారు. మోహన్ నాయకత్వంలో అంతర్జాతీయ పర్యాటక రంగంలో భారత్‌కు మరింత గుర్తింపు లభించాలని, తెలంగాణ పర్యాటక సామర్థ్యాన్ని ప్రపంచ వేదికపై చాటిచెప్పే అవకాశాలు మరింత విస్తరించాలని ఆమె ఆకాంక్షించారు.

# వరి కొయ్యలు కాల్చిన రైతుకు ఐదు వేల జరిమానా!

**ప్రజానావ, కథలాపూర్:** పంట వ్యర్థాలు, వరి కొయ్యలను తగులబెట్టే రైతులపై ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన చర్యల్లో భాగంగా జగిత్యాల జిల్లాలో ఓ రైతుకు భారీ జరిమానా పడింది. జిల్లాలోని కథలాపూర్ మండలం రాజారాంతండా గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఒక రైతు తన పొలంలో వరి కోతలు పూర్తయిన తర్వాత మిగిలిన వరి కొయ్యలకు (పంట వ్యర్థాలు) నిప్పు పెట్టాడు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి వరి కొయ్యలను కాల్చినందుకు గానూ, సదరు రైతుకు రాజారాంతండా గ్రామ పంచాయతీ కార్యదర్శి రూ. 5,000 జరిమానా విధిస్తూ చలానా జారీ చేశారు. పొలాల్లో మంటలు వేయడం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడమే కాకుండా, భూమిలోని పోషకాలు నశిస్తాయని, పక్కనే ఉన్న ఇతర పంట పొలాలకు కూడా ప్రమాదం పొంచి ఉంటుందని అధికారులు ఈ సందర్భంగా గుర్తుచేశారు. వరి కొయ్యలు కాల్చడం వల్ల పొరుగున ఉన్న తోటలు, ఇండ్లు తగులబడిపోతున్న ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా పెరుగుతున్న నేపథ్యంలో, వ్యవసాయ మరియు పోలీసు శాఖలు గట్టి నిఘా పెట్టాయి. రైతులు ఎవరూ కూడా పంట వ్యర్థాలను కాల్చవద్దని, శాస్త్రీయ పద్ధతుల్లో వాటిని భూమిలోనే దున్నేయాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. నిబంధనలు మీరితే కేసులతో పాటు భారీ జరిమానాలు తప్పవని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.



